ఈనాడు ఖమ్మం
శుక్రవారం అక్టోబరు 18, 2024 5



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తున్న ఈటల రాజేందర్, పక్కన శీలం పాపారావు, తాండ్ర వినోద్‌రావు, సత్యనారాయణ

సర్వమత సమానత్వం పాటించాలి: ఈటల

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, సర్వమత సమానత్వం పాటించాలని మల్కాజ్‌గిరి ఎంపీ, భాజపా నేత ఈటల రాజేందర్ అన్నారు. ఖమ్మంలోని ఖానాపురంలో(7వ డివిజన్) నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. బైపాస్ రోడ్‌లో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఖానాపురం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. మహిళలు బతుకమ్మలతో, కోలాట నృత్యాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈటల మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో హిందూ దేవాలయాలకు రక్షణ కరవైందన్నారు. ఇటీవల పలు హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విచారణ జరిపి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశప్రజలు ఆరాధించే ఛత్రపతి శివాజీకి ఖానాపురంలో విగ్రహం ఏర్పాటు చేయటాన్ని అభినందించారు. శివాజీ పరాయి పాలకుల గుండెల్లో సింహస్వప్నంగా నిలిచారని, అందరినీ కలుపుకొని శత్రువులపై యుద్ధం సాగించారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శీలం పాపారావు, భాజపా జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, ఉదయ్ ప్రతాప్, అల్లిక అంజయ్య, నున్నా రవికుమార్, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బుధవారం.. పాఠశాల భోజనం



ఖమ్మం రోటరీనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ (పాత చిత్రం)

ఈటీవీ, ఖమ్మం: 'మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయి. ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు పోస్తున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఉండటం లేదు. అన్నం, కూరలనూ సరిపడా వడ్డించటం లేదు. సగం ఖాళీ కడుపుతోనే ఉండాల్సి వస్తోంది' అని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల నుంచి తరచూ వింటుంటాం. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేలా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చొరవ చూపుతున్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రతి విద్యార్థికీ నాణ్యమైన భోజనం అందించేలా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఏజెన్సీలు, అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులకూ బాధ్యతలు అప్పగించారు. 'ప్రతి బుధవారం- పాఠశాల భోజనం' పేరిట చేపట్టిన కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది.

అధికారుల బడిబాట..

ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు ప్రతి బుధవారం తాము పర్యటిస్తున్న మండలంలోనే ఏదో ఒక సర్కారు బడిలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. అంతకుముందు విద్యాలయాన్ని పరిశీలిస్తున్నారు. పాఠశాల ఆవరణ, తాగునీటి ట్యాంకులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉన్నాయా..? అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులపైనా ఆరా తీస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా.. లేదా అనే అంశాలను పరిశీలిస్తున్నారు. పర్యటనలో భాగంగా తెలుసుకున్న అంశాలపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తున్నారు.

☆ 'ప్రతి బుధవారం.. పాఠశాల భోజనం' అనే కార్యక్రమానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మూడు నెలల క్రితం శ్రీకారం చుట్టారు. వివిధ శాఖల అధికారులు ఆకస్మికంగా ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేస్తుండటం వల్ల కొన్ని సమస్యలు మాదృష్టికి వస్తున్నాయి. కలెక్టర్ సూచనలకు అనుగుణంగా వాటిని పరిష్కరిస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యనందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోంది. విద్యాలయాల్లో సౌకర్యాలూ మెరుగుపడుతున్నాయి. పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బందిలో రోజు కొకరు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమమూ కొనసాగుతోంది. - సోమశేఖరశర్మ, డీఈఓ

విద్యాప్రమాణాలు పెంచేలా..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించటంతోపాటు విద్యాప్రమాణాలను పెంపొందించేందుకు 'ప్రతి బుధవారం- పాఠశాల భోజనం' కార్యక్రమం దోహదపడుతోంది. అధికారుల పర్యటనల ద్వారా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి. తాగునీటి ట్యాంకులు శుభ్రంగా లేకపోతే.. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నారు. బియ్యం నాణ్యత సరిగ్గా లేకపోతే పౌరసరఫరాల సంస్థ దృష్టికి తీసుకెళ్తున్నారు. మౌలిక వసతుల కల్పన అంశాన్ని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు తెలియజేస్తున్నారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్యం బాగోలేకున్నా, మరుగుదొడ్లు శుభ్రంగా లేకున్నా పంచాయతీ సిబ్బందికి తెలియజేసి సమస్యను పరిష్కరిస్తున్నారు. విద్యార్థులు వ్యాధుల బారినపడితే ప్రత్యేకంగా ఆయా విద్యాలయాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు.

పాఠం వినేదక్కడే.. నిద్రించేదక్కడే..!

పాల్వంచ విద్యావిభాగం, న్యూస్‌టుడే

☆ తొమ్మిది నెలలుగా అద్దె చెల్లించటం లేదంటూ ఖమ్మం నగరంలోని ఓ ఎస్సీ గురుకుల పాఠశాల భవనానికి యజమాని తాళం వేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఉన్నతాధికారుల హామీ మేరకు తాళం తీశారు.

☆ కొత్తగూడెంలోని ఎస్టీ బాలికల డిగ్రీ కళాశాల భవనానికి సక్రమంగా అద్దె చెల్లించటం లేదని యజమాని ఖాళీ చేయించారు. దిక్కుతోచని పరిస్థితిలో కళాశాలను మరో చోటుకు తరలించాల్సి వచ్చింది. కళాశాలకు సొంత భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించినా పనులు చేపట్టకపోవటం గమనార్హం.

గురుకులాలకు ఆదరణ బాగుండటంతో గత ప్రభుత్వం సామాజికవర్గాల వారీగా వీటిని నెలకొల్పింది. నిపుణులు బోధిస్తుండటంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది. అయితే అనేక గురుకులాలు వసతుల లేమితో సతమతమవుతున్నాయి. చాలా విద్యాలయాలు అరకొర సౌకర్యాలు కలిగిన అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల స్థలాలు కేటాయించినా నిర్మాణ పనులు మొదలుకాలేదు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొనసాగుతున్న గురుకులాలకు అద్దె చెల్లించకపోవటంతో వాటి యజమానులు తాళాలు వేస్తున్నారు. మరికొన్నిచోట్ల భవన సముదాయాలు అందుబాటులో లేక ఇతర ప్రాంతాలకు గురుకులాలు తరలిపోతున్నాయి.



పాల్వంచలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్టీ బాలికల గురుకుల డిగ్రీ కళాశాల

అద్దె భవనం.. అవస్థల గురుకులం..!

అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల విద్యాలయాల్లోని తరగతి గదుల్లో ఉదయం పూట పాఠాలు వినటం, రాత్రిపూట నిద్రించటం విద్యార్థులకు అలవాటుగా మారింది. అన్నీ ఒకేచోట ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం బోధన ఒకచోట, వసతి మరోచోట ఉండాలి. కొన్నిచోట్ల సొంత భవనాలు నిర్మించి సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల్లో మాత్రం క్రీడా మైదానాలు ఉండవు. గురుకులాలకు సొంత భవనాలు, మౌలిక వసతుల కల్పనపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే వేలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో..

గురుకులాలు	సంఖ్య	అద్దె భవనాల్లో కొనసాగుతున్నవి	విద్యార్థుల సంఖ్య
ఎస్సీ	23	4	11,550
ఎస్టీ	32	6	13,000
బీసీ	29	27	9,900
మైనార్టీ	16	16	5,268

అన్ని రకాల ఎస్టీ గురుకుల విద్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సమస్యలు ఉన్నప్పటికీ సర్దుకుపోతున్నాం. అద్దె భవనాల్లోని గురుకులాల్లో విద్యార్థులకు సరిపడా వసతులు లేవు. కొన్నిచోట్ల సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం స్థలాలు కేటాయించింది.
– నాగార్జునరావు, ఆర్సీఓ, ఎస్టీ గురుకుల విద్యాలయాలు



వాల్మీకి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

మహర్షి వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శం

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహర్షి వాల్మీకి జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలని, వారి ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. వాల్మీకి రామాయణ మహా గ్రంథాన్ని రచించి, మానవ విలువలు, ఆదర్శ జీవనం, మానవ సంబంధాలను సమాజానికి అందించారని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి జ్యోతి, జక్కుల వెంకటరమణ, ఫణీన్, వాల్మీకి సంఘం నాయకులు ఉపేందర్ రావు, శ్రీనివాసరావు, నర్సింహారావు, వెంకటరామయ్య, లక్ష్మి, పుల్లారావు, నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

నేడు కొత్త ఉపాధ్యాయులతో కలెక్టర్ ముఖాముఖి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 ద్వారా జిల్లాలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారితో ఈనెల 18న ఉదయం 11 గంటలకు ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. డీఎస్సీ నిర్వహణలో చేరిన ఉపాధ్యాయులంతా ఉదయం 10 గంటలకు సభాస్థలికి తప్పనిసరిగా చేరుకోవాలని కోరారు. దీనికి సంబంధించిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గురువారం మండల విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

నిరవధిక బంద్ విరమించిన యాజమాన్యాలు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించనందుకు నిరసనగా నాలుగు రోజులుగా చేస్తున్న నిరవధిక బంద్‌ను విరమించినట్లు కాకతీయ విశ్వవిద్యాలయ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి మద్ది ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన టోకెన్లకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. నేటి నుంచి యథావిధిగా కళాశాలలు పని చేస్తాయని, ఈ విషయం విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు. తాము చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపిన వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సర్వేత్రా ససేమిరా..!

ఏఈఓలకు నేడో, రేపో శ్రీముఖాలు జారీ

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

డిజిటల్ పంట సర్వే చేపట్టేందుకు వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓలు) ససేమిరా అంటున్నారు. సర్వే చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినా రాష్ట్రవ్యాప్తంగా ఏఈఓలు ముందుకు రావటం లేదు. ఇంత పెద్ద పని తమ ఒక్కరి వల్ల సాధ్యం కాదని మొండికేస్తున్నారు. దీనిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. విధుల్లో పాల్గొనని ఏఈఓలందరికీ మెమోలు జారీ చేసింది. అయినా స్పందించపోవటంతో నిబంధనల ప్రకారం నేడో, రేపో షోకాజ్ నోటీసులు జారీ చేసే అవకాశముందని విశ్వసనీయ సమాచారం.



రెగ్యులర్ ఏఈఓలు
ఖమ్మం: 113
భద్రాద్రి: 58
ఒప్పంద ఏఈఓలు:
58 09

గైర్హాజరైనట్లు నమోదు..

గతంలో రైతు వేదికలు లేదా తమ క్లస్టర్లలోని కార్యాలయాలకు వెళ్తే ఏఈఓలు హాజరు వేసుకునే అవకాశం ఉండేది. డిజిటల్ క్రాప్ సర్వే అంశం తెరపైకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఈ విధానాన్ని తొలగించింది. డిజిటల్ క్రాప్ సర్వే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని లింక్ ద్వారా హాజరు వేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టింది. గత పది రోజుల నుంచి ఏఈఓలు సర్వేకు వ్యతిరేకంగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా ఆయా క్లస్టర్ల ద్వారా వీరు గైర్హాజరైనట్లుగా పరిగణించి జిల్లా అధికారులు రాష్ట్ర అధికారులకు వివరాలు తెలియజేస్తున్నారు. పది రోజుల నుంచి తాము విధులకు హాజరై అన్ని పనులు చేస్తున్నా.. ఒక్క సర్వేలో పాల్గొనకుంటే గైర్హాజరైనట్లు ఎలా పరిగణిస్తారని ఏఈఓల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్.నాగుల్ మీరా ప్రశ్నిస్తున్నారు.

ఒప్పంద ఏఈఓల మెడపై కత్తి..

ఒప్పంద ఏఈఓలకు నెలకు కేవలం రూ.16వేల చొప్పున వేతనం అందుతోంది. రెగ్యులర్ ఏఈఓలు సర్వేకు నిరాకరిస్తుండటంతో ఇప్పుడు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఒప్పంద ఏఈఓలపై దృష్టి సారించింది. డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను వెంటనే డౌన్‌లోడ్ చేసుకుని సర్వే మొదలుపెట్టకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని ఒప్పంద ఏఈఓలు సర్వే చేపట్టేందుకు సిద్ధమవటం గమనార్హం.

డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టకపోవటంతో ఇప్పటికే ఏఈఓలకు మెమోలు జారీ చేశాం. అయినప్పటికీ వారు సర్వే మొదలుపెట్టకుంటే ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.
- డి.పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం



ఆర్టీసీ బండి.. ఆదాయం దండి

☆ రూ.2594.5 లక్షల రాబడి

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: దసరా, బతుకమ్మ వేడుకల నేపథ్యంలో ఖమ్మం రీజియన్‌లో ఆర్టీసీకి ఆదాయం సమకూరింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పండుగ సమయాల్లో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. దీంతో సాధారణ రోజులతో పోలిస్తే ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరింది. ఈనెల 1 నుంచి 16 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు డిపోలకు సంబంధించి ఎగువ, దిగువ మార్గాల్లో రూ.2594.5 లక్షల ఆదాయం లభించింది. ఒకటో తేదీ నుంచి 11 వరకు హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికుల కోసం 795, 13 నుంచి 16 వరకు 420 సర్వీసులను అదనంగా నడిపింది. ఆయా బస్సుల్లో మొత్తం 32.9 లక్షల మంది ప్రయాణించగా వారిలో 20.4 లక్షల మంది మహిళలు ఉన్నారు. ఈ నేపథ్యంలో 38.05 లక్షల కిలో మీటర్లు బస్సులు నడిపారు. ఆక్యుపెన్సీ రేషియో 106 శాతం నమోదైంది.

డిపోల వారీగా వివరాలు ఇలా..

డిపో	ప్రయాణికులు (లక్షలు)	ఆదాయం (రూ.లక్షలు)	మహిళా ప్రయాణికులు (లక్షలు)	కిలోమీటర్లు (లక్షలు)	ఓఆర్
ఖమ్మం	7.52	627.26	4.57	9.06	109
మధిర	3.29	311.16	1.82	4.35	114
సత్తుపల్లి	7.31	459.77	4.49	6.75	108

పది నెలలు గడవకముందే విమర్శలు తగవు: పువ్వాళ్ల

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడవక ముందే భారాస నేతలు విమర్శలు చేయడం సరికాదని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అధికారం కోల్పోయినా భారాస నాయకుల పద్ధతి మారలేదని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసే ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోందని చెప్పారు. మహిళలకు ఉచిత ప్రయాణం, సబ్సిడీ విద్యుత్, గ్యాస్, ఉద్యోగ నియామకాలు చేపడుతున్న విషయం కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పదేళ్ల భారాస పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బయట పడేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శ్రమిస్తున్నారని అన్నారు. పదేళ్లలో తనపై అనేక అక్రమ కేసులు బనాయించారని పువ్వాళ్ల గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, రైతు సంఘం నాయకుడు నల్లమల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని చెప్పారు. భారాస హయాంలో రూ.7 లక్షల కోట్లు అప్పుడు చేశారని ఆరోపించారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.56 వేల కోట్ల అప్పులను తీర్చి సంక్షేమ అభివృద్ధిని కొనసాగిస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై ఎఫ్ఆర్‌బీఎం పరిధిని దాటి గతంలో అప్పులు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలో భాగంగా నెలరోజుల్లో 18 వేల కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. మరో 13 వేల కోట్లతో రుణమాఫీ పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. వరదల సమయంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.16,500 నష్ట పరిహారం చెల్లించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. విలేకర్ల సమావేశంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, అబ్దుల్ రషీద్, సత్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ముప్పునకు ముకుతాడు..!

కూసుమంచి, న్యూస్‌టుడే

ఆటోమేటిక్ ఫాలింగ్ గేట్లు.. వర్టికల్ గేట్లు.. రేడియల్ క్రస్ట్ గేట్లు.. మూడూ జలాశయాల్లో నిల్వ నీటిని, వరద ప్రవాహాన్ని బయటకు విడుదల చేసేందుకు దోహదపడేవే.. ఒక్కోదాని పని విధానం ఒక్కో తీరున ఉంటుంది. ఇటీవల పాలేరు జలాశయానికి పోటెత్తిన వరద తాలూకు బీభత్స పరిస్థితుల నేపథ్యంలో అందరి దృష్టి జలాశయం గేట్లపై పడింది. ఆటోమేటిక్ ఫాలింగ్ గేట్లు సమర్థంగా పనిచేయక అనర్థం జరిగిందనే వాదన ఓ వైపు.. అలాంటిదేమీ లేదన్న వివరణలు మరోవైపు చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ముప్పు తలెత్తకుండా వర్టికల్ (నిలువు) గేట్లను ఏర్పాటు చేయాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

1824 నుంచి అవే తరహా..: పాలేరు జలాశయాన్ని 1824లో అప్పటి నైజాం ప్రభుత్వం నిర్మించింది. పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు. 2.50 లక్షల ఎకరాల పరీవాహక ప్రాంతమున్న పాలేరు ఏటి నీరు జలాశయంలో కలుస్తుంది. 23 అడుగులకు మించి వచ్చే వరద దిగువకు ప్రవహించేలా జలాశయానికి 560 మీటర్ల అలుగు, 83,820 క్యూసెక్కుల వరదను దిగువకు పంపించగలిగే సామర్థ్యమున్న ఆరు ఆటోమేటిక్ ఫాలింగ్ గేట్లను అప్పట్లోనే ఏర్పాటుచేశారు. వరద 23 అడుగులకు మించితే.. గేట్లపై ఒత్తిడి పెరిగి వాటంతట అవే ఫాల్ (పడిపోవడం) అవుతాయి. 1989లో భారీగా వరద వచ్చిన నేపథ్యంలోనూ జలాశయం నీటిమట్టం 27 అడుగులకు మించలేదు.



భారీగా వరద వచ్చే సమయంలో గేట్లలో వ్యర్థాలను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది (పాత చిత్రం)

వర్టికల్ ఏర్పాటుకు డిమాండ్.. ఆటోమేటిక్ గేట్లను తొలగించి వర్టికల్‌వి అమరిస్తేనే మేలనే అభిప్రాయం ఇంజినీరింగ్ నిపుణుల నుంచి వ్యక్తమవుతోంది. వీటితో వరద ముప్పును గమనించి జలాశయంలో నీటిని ముందే విడుదల చేసే అవకాశం ఉంటుందన్నది వారి భావన. మోటారు సాయంతో, మానవ శక్తితో (మ్యానువల్‌గా) పనిచేసేలా అమరికలో జాగ్రత్త పాటించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కనీసం 1.50 లక్షల క్యూసెక్కుల వరద బయటకు వెళ్లేలా పరిధిని విస్తరించాలంటున్నారు.

☆ 'ఆటో గేట్ల స్థానంలో వర్టికల్ గేట్ల విషయమై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఆ తర్వాత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. వీటి ఏర్పాటునకు కనీసం రూ.కోటి వ్యయం అయ్యే అవకాశం ఉంది. చర్చించి నిర్ణయం తీసుకుంటాం.'
- మంగళంపూడి వెంకటేశ్వర్లు, ఎస్ఈ.

గార్డ్‌బోలే ఫాలింగ్ గేట్ల పనితీరుపై..

2012లో అప్పటి ప్రభుత్వం సాగర్ కాల్వలు, కట్టడాల ఆధునికీకరణ పనులు చేపట్టిన నేపథ్యంలో పుణెకు చెందిన గార్డ్‌బోలే సాంకేతిక విధానంతో కూడిన గేట్లను పాలేరు జలాశయంలో అమర్చారు. పూర్వపు ఆరు గేట్లను తొలగించి 24 గార్డ్‌బోలే గేట్లను అమర్చారు. ఆరంభం నుంచీ వీటి పనితీరుపై ఆరోపణలున్నాయి. ఏర్పాటు చేసిన అనేక ఏళ్ల పాటు అవి ఆటోమేటిక్‌గా పైకి లేవకపోవటంతో సిబ్బంది అప్పటికప్పుడు జాకీలు ఏర్పాటుచేసి నీటిని బయటకు పంపిన సందర్భాలున్నాయి. వరద సమయంలో కొట్టుకొచ్చే చెత్త, చెట్టూచేమతోనూ పనితీరుపై ప్రభావం పడుతోంది. చెట్లు ఇరుక్కుపోయి గేట్లు మొరాయిస్తున్నాయి. గత వేసవిలో కంపెనీ ఇంజినీర్లు వచ్చి మరమ్మతులు చేశారు. గత నెల 1న పాలేరుకు వరద పోటెత్తిన సమయంలోనూ వీటి పనితీరుపై ఆరోపణలు వచ్చాయి. అధికారులు మాత్రం వంద శాతం గేట్లు పనిచేశాయని, లేకుంటే జలాశయానికే ముప్పు వచ్చి ఉండేదని వాదించారు.

అండర్-19 జిల్లా జట్ల ఎంపికలు

ఖమ్మం క్రీడలు: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఖమ్మం జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించే తేదీలను కార్యదర్శి మూసా కలీం గురువారం ప్రకటించారు. ఈనెల 20న విలువిద్య, బ్యాడ్మింటన్, చెస్, 23న హ్యాండ్‌బాల్, వాలీబాల్, 27న బాస్కెట్‌బాల్, నెట్‌బాల్, కరాటే, నవంబరు 5న అథ్లెటిక్స్ పోటీలు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తామని, అదనపు వివరాలకు 9848341238 నంబరుకు సంప్రదించాలని కార్యదర్శి కోరారు.

సెమీస్ దశలో క్రికెట్ పోటీలు

ఖమ్మం జోన్ డిగ్రీ కళాశాలల క్రికెట్ పోటీలు ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో గురువారం ప్రారంభమయ్యాయి. 12 జట్లు నమోదు చేసుకోగా పది రంగంలో నిలిచాయి. రెండు వికెట్లపై మ్యాచులు కొనసాగించారు. ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్, కవిత మెమోరియల్, వికాస్, కొత్తగూడెం కళాశాలల జట్లు సెమీస్‌కు చేరాయి. శుక్రవారం సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచులు నిర్వహించిన అనంతరం యునివర్సిటీ పోటీల్లో పాల్గొనే ఖమ్మం జోన్ జట్టును ఎంపిక చేస్తామని, సమన్వయకర్త డాక్టర్ బి.వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘునందన్ పలువురు పీడీలు పాల్గొన్నారు.

దాతలు స్పందిస్తే..

ఆ ఊరిలో తొలి వైద్యుడు

ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించిన విద్యార్థికి ఆర్థిక ఇబ్బందులు

నేలకొండపల్లి, న్యూస్‌టుడే

గ్రామంలో ఇప్పటిదాకా వైద్యవిద్యలో ఎవరూ సీటు సాధించలేదు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి ఆ ఘనత సాధించాడు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ విద్యాలయాల్లోనే చదువుతూ పాఠశాల, కళాశాల విద్యను పూర్తి చేశాడు. ఇప్పుడు తనకెంతో ఇష్టమైన వైద్యవిద్య చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుగోడగా నిలుస్తున్నాయి. కూలీపనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న అతని తల్లిదండ్రులు తమ కుమారుని వైద్యవిద్యకు సాయమందించాలని అర్థిస్తున్నారు.

మానవీయం

నేలకొండపల్లి మండలం సుర్దేపల్లి గ్రామానికి చెందిన మాతంగి వెంకటేశ్వర్లు, సుశీల దంపతుల కుమారుడు శ్రీపతి. చిన్ననాటి నుంచే చదువులో ముందుండేవాడు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. పదో తరగతి బోదులబండ హైస్కూల్‌లో పూర్తి చేశాడు. అన్నపురెడ్డిపల్లిలోని గురుకుల కళాశాలలో సీటు దక్కటంతో అక్కడ ఇంటర్ చదివి 929 మార్కులు సాధించాడు. ఖమ్మంలో శిక్షణ తీసుకుని ఇటీవల వెల్లడైన 2024 నీట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 5,556, ఎస్సీ కేటగిరీలో 488వ ర్యాంకు దక్కించుకున్నాడు. జనగాం ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ప్రభుత్వ సీటు వచ్చినా ఏడాదికి హాస్టల్, రిజిస్ట్రేషన్, ట్యూషన్ ఫీజుల రూపంలో రూ.70 వేల వరకూ చెల్లించాల్సి వస్తోంది. దీంతోపాటు పుస్తకాలు, ఇతర స్టడీ మెటీరియల్ కోసం రూ.వేలు ఖర్చవుతాయి. తల్లిదండ్రులు కౌలు వ్యవసాయం, కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని వెళ్లదీస్తున్నారు. రెక్కాడితేకానీ డొక్కాడని వారికి అంత మొత్తం చెల్లించే స్తోమత లేదు. తమ కుమారుని చదువుకు సాయమందించాలని వారు వేడుకుంటున్నారు. దాతలెవరైనా సాయమందిస్తే వైద్యవిద్య పూర్తి చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలందిస్తానని శ్రీపతి అంటున్నాడు.



తల్లిదండ్రులతో శ్రీపతి

దాతలు స్పందించాల్సిన ఫోన్ నంబరు: 9394450050

ప్లేట్ ఫిరాయిస్తే వాతలే

నంబరు ప్లేట్లు సరిగా లేని వాహనాలపై పోలీసుల నజర్

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే

రాష్ట్రానికి గంజాయి తరలించే వారికి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలు గుమ్మంగా మారాయి. సరిహద్దు రాష్ట్రాలైన ఒడిశా, ఏపీలోని పలు ప్రాంతాల్లోంచి హైదరాబాద్ తదితర నగరాలకు బస్సులు, కార్లు, లారీల్లో అక్రమంగా పెద్ద ఎత్తున సరకు తరలిస్తున్నారు. ఇటీవల కొందరు యువత ద్విచక్రవాహనాల్లో పెద్ద ఎత్తున గంజాయి తీసుకెళ్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపట్టే తనిఖీల్లో పట్టుబడుతున్నారు. ద్విచక్రవాహనాల్లో ఎక్కువగా నంబరు ప్లేట్లు సరిగా లేనివేనని పోలీసులు గుర్తించారు. మరికొందరు జరిమానాను తప్పించుకోవాలని వక్రబుద్ధి ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా పోలీసు యంత్రాంగం 'ప్లేట్ ఫిరాయింపు'లపై నజర్ పెట్టింది. తనిఖీలను ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా నిరంతరం సాగిస్తేనే సత్ఫలితాలుంటాయి.

నేరాలకు పాల్పడే వారితో పాటు కొందరు వాహనదారులు జరిమానాను తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్ కనిపించకుండా అడ్డదారులు తొక్కుతున్నారు. ఇంకొందరు ట్రెండ్ పేరుతో అస్పష్టంగా ముద్రిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా వాహనాలను గుర్తించేందుకు ఎస్పీ ఆదేశాలతో జిల్లా పోలీసు అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో కొన్ని బృందాలను మఫ్టీలో దించారు. వారు దుకాణాలు, కూడళ్లు, జన సమ్మర్ధ ప్రాంతాల్లో నంబరు ప్లేట్లు సరిగా లేని వాహనాలను పట్టుకుంటున్నారు. తొలి తప్పుగా కొందరు వాహనదారులను హెచ్చరించి జరిమానాతో వదిలేస్తున్నారు. అయినా హద్దులు మీరితే కేసులు నమోదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నారు. కొందరు బుల్లెట్ వాహన యజమానులు మోటారు వాహన చట్టాన్ని కాదని డాబు ప్రదర్శిస్తున్నారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను బిగించడంపై పోలీసులు సీరియస్‌గా ఉంటున్నారు. ఏ మాత్రం ఉపేక్షించకుండా సైలెన్సర్లను తొలగించి ధ్వంసం చేస్తున్నారు. ఈ ప్రయోగం సత్ఫలితాలిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.




నంబర్ ప్లేట్ లేకుండానే వాహన వినియోగం

నంబర్ ప్లేట్లపై తనిఖీలు, కేసులు

(ఈ ఏడాది జనవరి నుంచి..)

ఉల్లంఘన	కేసులు	జరిమానా (రూ.ల్లో)
నంబర్లు సరిగా లేనివి	869	1,73,800
ఫ్యాన్సీ, ఇర్రెగ్యులర్ ప్లేట్లు	91	18,200
ట్యాంపర్ చేసినవి	182	36,400
నంబర్లు తొలగించినవి	481	96,200

నిబంధనలు పాటించేలా అవగాహన



రోడ్డు భద్రత నిబంధనలు, మోటారు వాహన చట్టాన్ని పాటించడంపై అవగాహన కల్పించడంతో పాటు ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా నంబరు ప్లేట్ సరిగా లేనివారిని ఉపేక్షించే ప్రసక్తే ఉండదు. తప్పు మళ్లీ చేస్తే వాహనాన్ని సీజ్ చేస్తాం. ద్విచక్ర వాహనాలను నడిపే విషయంలో యువత దూకుడుగా వ్యవహరించొద్దు. సైలెన్సర్లతో రద్దీలో అధిక శబ్దం చేస్తే ఇతరులు భయాందోళన చెందుతారు. ఒక్కోసారి గుండెపోటు వచ్చే ప్రమాదమూ పొంచిఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో నిబంధనల పాటింపుపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

- బి.రోహిత్‌రాజు, ఎస్పీ, భద్రాద్రి కొత్తగూడెం

'మధిర బాలోత్సవ్- 2024' బ్రోచర్ ఆవిష్కరణ

మధిర, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి మధిర బాలోత్సవ్-2024కు సంబంధించిన బ్రోచర్‌ను ఆ సంస్థ అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, సెక్రటరీ బాబ్జా స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆలయంలో గురువారం ఆవిష్కరించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యంలో నవంబరు నెలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది. నవంబరు 15, 16 తేదీల్లో బంజారాకాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 15న శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు, 16న నీతి పద్యాలు, నీ సత్తా చాటుకో, ఏకపాత్రాభినయాలు, ఉపన్యాసం, దేశభక్తి గేయాలు, చిత్రవేషాల ప్రదర్శన తదితర అంశాల్లో పోటీలుంటాయని వివరించారు. ఎంట్రీలను నవంబరు 10లోగా 'మధిర బాబ్జా సెక్రటరీ, ఇంటి నంబర్ 1-329, బంజారా కాలనీ, మధిర' అనే చిరునామాకు పంపాలని, పూర్తి వివరాలకు 94406 75787ను సంప్రదించాలని కోరారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్ తదితరులు

గిరిజన గురుకుల అతిథి అధ్యాపకుల దరఖాస్తులు

భద్రాచలం, న్యూస్‌టుడే: గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 25 వరకు భద్రాచలం ఆర్సీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పాటు డెమో ఆధారంగా ఎంపికలు ఉంటాయని వెల్లడించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలోని కళాశాలల్లో 13 పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు వివరించారు. తెలుగు 2, ఇంగ్లిష్ 1, కెమిస్ట్రీ 1, జువాలజీ 2, కంప్యూటర్ సైన్స్ 2, కామర్స్ 3, ఎకనామిక్స్ 1, చరిత్ర 1 పోస్టులు ఉన్నాయన్నారు.

'నవోదయ' 9, 11 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కూసుమంచి, న్యూస్‌టుడే: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విద్యాలయ ప్రధానాచార్యుడు కె.శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా తరగతుల్లో ప్రవేశ పరీక్షల ద్వారా ఖాళీల భర్తీ ప్రక్రియ నిర్వహించనున్నట్లు వివరించారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ అనుమతి పొందిన పాఠశాలల్లో చదువుతూ ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. ఈ నెల 30లోగా www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు.

ఇంద్రకీలాద్రికి పాదయాత్ర



టేకులపల్లి, న్యూస్‌టుడే: టేకులపల్లి నుంచి విజయవాడలోని ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకునేందుకు స్థానిక కోదండరామాలయం అర్చకులు శ్రీరంగం విజయ్‌సాయి చక్రీ గురువారం తెల్లవారుజామున పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రికి ఆయన చంద్రుగొండ చేరుకున్నారు.

నీలమణి వచ్చేసింది



పాలపిట్ట నీలమణి పేరుతో ఓ పోస్టర్ గురువారం ఖమ్మం స్టేడియంలో ప్రత్యక్షమైంది. సీఎం కప్ పేరుతో ఓ క్రీడా సంబరానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూరల్ టు గ్లోబల్, క్రాఫ్టింగ్ ఛాంపియన్స్ అనే ట్యాగ్ లైన్‌లను ఇప్పటికే విడుదల చేశారు. సీఎం కప్ క్రీడల చిహ్నంగా 'నీలమణి' పేరుతో పాలపిట్టను ఎంపిక చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అధికార పక్షి జెర్సీ ధరించిన లోగోను ప్రభుత్వం విడుదల చేసింది. క్రీడల ప్రారంభానికి ముందు నుంచే సందడి చేస్తున్న నీలమణి ఖమ్మం పటేల్ స్టేడియంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

- ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

ఒడిసిపడితేనే.. తాగునీరు

మణుగూరు మండలంలోని బుడగల గ్రామానికి వెళ్లాలంటే అటవీ ప్రాంతంలో సుమారు 25 కి.మీటర్లు ప్రయాణించాలి. ఐదు వాగులు దాటాలి. కాలినడక కూడా కష్టమేనంటే అతిశయోక్తికాదు. అయినా అడవినే నమ్ముకొని 50 ఇళ్లు వెలిశాయి. జనాభా 125 మంది. ప్రస్తుతం వారిని తాగునీటి సమస్య వేధిస్తోంది. వాగునీరు తాగడంతో స్థానికంగా తరచూ డయేరియా సోకుతోంది. దీంతో గ్రామస్థులందరూ రాళ్లను ఎత్తుగా పేర్చి వాటిపై రెండు వరలను అమర్చారు. భూమి నుంచి వచ్చే ఊట నీరు వెళ్లకుండా చుట్టూ మట్టికప్పారు. దీంతో నీటితో ఆ వరలు నిండిపోతాయి. వాటిని బిందెల ద్వారా తెచ్చుకొని అవసరాలు తీర్చుకుంటున్నారు. కాగా ఈ విషయాన్ని ఐటీడీఏ పీవో రాహుల్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకువెళ్లగా.. అతిత్వరలో తాగునీటి బావిని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

- మణుగూరు, న్యూస్‌టుడే



గట్టున పడేందుకు..



మీరు చూస్తున్న ఈ చిత్రం.. డంపింగ్ యార్డు నుంచి ఇసుకను తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు అని భావిస్తే పొరబడినట్టే. ఆకేరు వరద అన్నదాతలకు తీసుకొచ్చిన కష్టాలివి. ఇటీవల భారీ వర్షాలు, వరద ఉద్ధృతికి ఆకేరు పరీవాహక ప్రాంతాల్లోని వందలాది ఎకరాల పంట పొలాల్లో ఇసుక మేటవేసింది. వ్యవసాయ భూములు ఆనవాళ్లు కోల్పోయాయి. దీంతో తమ పొలం గట్లు ఎక్కడున్నాయోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రాకాసితండా పరిధిలోని పంట పొలాల్లో నిలిచిపోయిన ఇసుక మేటలను రూ.లక్షల వెచ్చించి జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో బయటకు తరలిస్తున్నారు. పొలం గట్లను గుర్తించే పనిలో మునిగిపోయారు. - న్యూస్‌టుడే, తిరుమలాయపాలెం

నకిలీ చలాన్లు పంపించిన పలువురిపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరానికి చెందిన మనోహర్, విజయలక్ష్మి, సురేష్, వేణు, సునీత, భద్రాచలానికి చెందిన నాగసుధీర్, సారపాకకు చెందిన రామకృష్ణ, మరిపెడబంగ్లాకు చెందిన విజయ్‌కుమార్, మహబూబాబాద్‌కు చెందిన రమేష్‌పై కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. కర్నూలుకు చెందిన వెంకన్న వద్ద వీరంతా మసాలాలు కొనుగోలు చేశారు. రూ.26,31,760 చెల్లించినట్లు నకిలీ బ్యాంకు చలాన్లు పంపి మోసగించారు. బాధితుడు ఈనెల 7న కర్నూలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాణించాలి: పీఓ

భద్రాచలం, న్యూస్‌టుడే: అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకుని మిగతా వారికి ఆదర్శనీయంగా ఉండాలని ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎంపికైన లబ్ధిదారులకు గురువారం తన కార్యాలయంలో చెక్కులు అందించారు. ట్రైకార్ ద్వారా మంజూరైన గ్రామీణ రవాణా పథకంలో చర్ల మండలానికి చెందిన చుంచుపల్లి అశోక్, చిక్కాల సంతోష్‌కుమార్‌లకు రెండు జోస్ బ్లూ వాహనాలు మంజూరు చేశారు. ఒక్కో దాని ధర రూ.8.31 లక్షలు ఉండగా ఇందులో రాయితీ రూ.2.88 లక్షలు వచ్చిందని తెలిపారు. బ్యాంకు రుణం రూ.4.38 లక్షలు ఉండగా లబ్ధిదారు వాటా కింద రూ.1.05 లక్షలు జమ చేయాల్సి ఉందని వెల్లడించారు. ములకలపల్లి మండలానికి చెందిన గోడ నరేశ్‌కు రూ.6.39 లక్షల విలువైన టాటా ఏసీ వాహనం మంజూరైందని దీనికి రూ.రూ.2.88 లక్షల రాయితీ వచ్చిందని చెప్పారు. వీరికి వాహన తాళాలు అందించి రాణించాలని అభిలషించారు.

★ టేకులపల్లి మండలానికి చెందిన గిరిజన మహిళలకు రూ.9.90 లక్షల రాయితీ చెక్కును పీఓ అందించారు. రూ.16 లక్షలతో రుతు రుమాళ్ల యూనిట్ మంజూరైనందున దీన్ని పరిశ్రమలా తీర్చిదిద్దుకుని ముందుకు సాగాలని సూచించారు. నిరుద్యోగులు అందుబాటులో ఉన్న ఉపాధి మార్గాలను ఎంచుకుని అభివృద్ధి చెందాలని చెప్పారు.



గిరిజన మహిళలకు రూ.9.90 లక్షల చెక్కు అందిస్తున్న పీఓ రాహుల్



సత్తుపల్లి: చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి తదితరులు

గిరిపుత్రికకు ఐటీడీఏ పీఓ ఆర్థిక సాయం

ఈనాడు కథనానికి స్పందన

సత్తుపల్లి, భద్రాచలం, న్యూస్‌టుడే: వైద్య విద్యలో సీటు సాధించిన సత్తుపల్లి మండలం గుడిపాడుకు చెందిన గిరిపుత్రిక రాజిని శివభార్గవిని ఐటీడీఏ పీవో రాహుల్ అభినందించారు. సంస్థ తరఫున గురువారం భద్రాచలంలో విద్యార్థినికి రూ.50వేలు అందజేశారు.

★ సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ దంపతులు రాజిని శివభార్గవిని శాలువాతో సత్కరించి అభినందించారు. అమెరికాలో నివాసం ఉంటున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చల్లగుళ్ల నరసింహారావు కుమారుడు నిఖిల్, గౌతమి దంపతులు వితరణ చేసిన రూ.20వేల చెక్కును సదరు విద్యార్థినికి ఎమ్మెల్యే అందజేశారు. వీటితోపాటు దిలీప్ రూ.4,500లను ఫోన్‌పే ద్వారా చెల్లించారు. మొత్తంగా విద్యార్థినికి రూ.3,14,500 సమకూరాయి.

రామాలయంలో శబరి మాత ఉత్సవం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం అశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని శబరిమాత ఉత్సవాన్ని నిర్వహించారు. పండ్లు పూలను పట్టుకుని ఆలయ ప్రదక్షిణ చేశారు. కోవెల ప్రాంగణంలోని వాల్మీకి విగ్రహం వద్ద శబరి స్మృతి యాత్రను ఏఈవో భవాని రామకృష్ణారావు, ప్రధానార్చకుడు విజయరాఘవన్, పీఆర్వో సాయిబాబా ప్రారంభించారు. శబరిమాత చిత్రపటానికి పూలదండలు వేశారు. చిత్రకూట మండపం నుంచి మాడవీధుల మీదుగా గిరి ప్రదక్షిణ సాగింది. రాజా తూము లక్ష్మీనరసింహదాసు, భక్తరామదాసు, దమ్మక్క విగ్రహాలకు పూలదండలు అలంకరించారు. గిరిప్రదక్షిణ నుంచి ఆలయానికి చేరుకున్న అడవి బిడ్డలు స్వామిని దర్శించుకున్నారు. పండ్లు పుష్పాలను సమర్పించారు. నిత్య కల్యాణోత్సవ విశిష్టతను వైదిక పెద్దలు వివరించారు. మాంగళ్యధారణ వేళ భక్తులు నీరాజనాలు పలికారు. తలంబ్రాల సన్నివేశం తన్మయత్వాన్ని నింపింది. గిరిజన మహిళలకు శబరిమాత ప్రసాదంగా చీర, సారెను అందించారు. తీర్థప్రసాద వినియోగమైంది. ప్రధానార్చకుడు విజయ రాఘవన్ నేతృత్వంలో వైదిక ప్రక్రియను నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలోని శబరి నదికి రామాలయం నుంచి వెళ్లిన వైదిక సిబ్బంది పూజలు చేశారు. ఈ నదికి చీర సారె సమర్పించారు. అక్కడ ఉన్న శబరి మాత విగ్రహానికి పూజలు చేశారు.



శబరి మాత చిత్రపటంతో ఊరేగింపు

బెళగావి ఎక్స్‌ప్రెస్ మళ్లీ వచ్చిందోచ్

మణుగూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బెళగావి ఎక్స్‌ప్రెస్ పునఃప్రారంభమైంది. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో కొత్తగూడెం మీదుగా మణుగూరు రైల్వేస్టేషన్‌ను చేరుకుంది. గతంలో ఉన్న ఈ ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు రద్దు చేసి హైదరాబాద్ వరకే పరిమితం చేసిన విషయం తెలిసిందే. దాంతో మణుగూరు రైల్వేస్టేషన్‌కు ఒకే ఒక రైలు దిక్కయింది. తరవాత ఈ ప్రాంతవాసులు ఎన్నో విజ్ఞాపనలు చేసిన అనంతరం స్పందించిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఎట్టకేలకు బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను హైదరాబాద్ నుంచి మణుగూరు వరకు పొడిగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు అది ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లింది. వారానికి నాలుగుసార్లు ఆది, సోమ, బుధ, గురువారాల్లో ఇది నడవనున్నట్లు మణుగూరు రైల్వేస్టేషన్ మాస్టర్ శివప్రసాద్ చెప్పారు. మొత్తం 95 ట్రిప్‌ల వరకు దీన్ని నడిపించనున్నారు. ఇది మొదటి ట్రిప్. అనంతరం ప్రజల ఆదరణ ఉందా? లేదా? అనే దానిపై లెక్కలు తీయనున్నారు. అనంతరం దీన్ని కొనసాగించాలా? వద్దా? అనే విషయమై దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.



మణుగూరు రైల్వే స్టేషన్‌లో ఆగిన బెళగావి ఎక్స్‌ప్రెస్

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	5,800	7,000	6,800
పెసలు	3,500	7,400	7,100
ఏసీ ఎండుమిరప	14,500	19,000	16,000
ఏసీతాలుమిరప	6,800	9,600	9,000
ఎండుమిరప	9,000	16,900	15,000
తాలుమిరప	6,600	9,000	8,000

చికెన్ ధరలు: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

వీవీపాలెం.. సేవల్లో ఘనం

ప్రగతి పథంలో ప్రాథమిక సహకార సంఘం

ఆరు దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ఆ ప్రాథమిక సహకార పరపతి సంఘం అంచెలంచెలుగా ఎదిగింది. రైతులకు పలు రకాల సేవలందిస్తూ ఉమ్మడి జిల్లాలోనే తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుంటోంది. క్రమంగా ఎదుగుతూ 15 వేల మంది సభ్యులతో, 5,600 మంది ఓటర్లతో అలరారుతోంది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం సొసైటీపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

రఘునాథపాలెం, న్యూస్‌టుడే:

వీవీపాలెం, వేపకుంట్ల, ఎం.చింతగుర్తి రెవెన్యూ గ్రామాల పరిధిలోని 11 గ్రామాలతోపాటు, నగర శివారు బల్లేపల్లి, ధంసలాపురం, వెలుగుమట్ల రెవెన్యూ గ్రామాలతో 1962లో ఈ సంఘం ఏర్పాటైంది. రైతులకు రుణాలు అందించడంతోపాటు సాధారణ బ్యాంకు సేవలు నిర్వహిస్తున్నారు. ఎరువులు, విత్తనాలు, టార్పాలిన్ పట్టాలు విక్రయిస్తుంటారు. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు తక్కువ ధరకు నీరు అందిస్తున్నారు. మీసేవ కేంద్రం త్వరలో ప్రారంభించనున్నారు. 3,317 మంది రైతులకు రూ.15 కోట్లు పంట రుణం అందించారు. 45 మందికి దీర్ఘకాలిక(ఎల్‌టీ) రుణంగా రూ.కోటి, 400 మందికి మధ్యకాలిక(ఎంటీ) రుణంగా రూ.1.5 కోట్లు అందించారు. 1,062 మంది రైతులకు రూ.4.75 కోట్లు రుణమాఫీ చేశారు. వీరిలో 600 మంది రైతులకు రూ.2.7 కోట్లు రుణంగా అందించారు. మరో రూ.40 లక్షలు రుణం అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



వి.వెంకటాయపాలెం ప్రాథమిక సహకార సంఘం

సంఘం ప్రత్యేకతలు..

40 చొప్పున చిన్న, పెద్ద లాకర్లు అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలో ఈ సౌకర్యం కలిగిన ఏకైక సంఘంగా ఇదే. ★ సంఘంలో 5 వేల సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలున్నాయి. 3 వేల ఖాతాలు నిర్వహణలో ఉన్నాయి. రూ.35 లక్షలు లావాదేవీలు జరిగాయి. ★ సంఘంలో ఇటీవలి వరకు రూ.3 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా ఉన్నాయి. ప్రస్తుతం రూ.2.2 కోట్లు ఎఫ్‌డీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇలా భారీ మొత్తంలో డిపాజిట్ కలిగిన ఏకైక సంఘం ఇది. ★ కేంద్రం నిధులతో 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము అందుబాటులోకి తెచ్చారు. ★ బంగారం మదుపుగా పెట్టుకుని 520 మందికి రూ.5.4 కోట్లు రుణంగా అందించారు. ★ 2018-19లో మొక్కజొన్నల కొనుగోలులో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.

పురస్కారాలు....

2023-24కు నిరర్థక అప్పులు తగ్గించినందుకు, డిపాజిట్లు, బంగారం రుణాలు అందించినందుకు ప్రథమ, నష్టాలు తగ్గించినందుకు బెస్ట్ పెర్ఫామెన్స్ కింద ప్రథమ పురస్కారాలను అందుకుంది.

కొవిడ్ విపత్తులోనూ సేవలు

- రావూరి సైదుబాబు, ఛైర్మన్



రైతుల సంక్షేమమే లక్ష్యంగా మా సంఘం పని చేస్తోంది. కొవిడ్ విపత్తులోనూ సేవలు కొనసాగించాం. ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచాం. పెద్ద మొత్తంలో డిపాజిట్లు సేకరించడం, బంగారంపై రుణాలు ఇవ్వడంలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉన్నాం.

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర •వైరా

ఉద్యాన పంటల పరిశీలన



డ్రాగన్ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి మధుసూదన్

మధిర, న్యూస్‌టుడే: మధిర డివిజన్‌లోని ఉద్యాన పంటలను జిల్లా ఉద్యాన అధికారి ఎంవీ మధుసూదన్ గురువారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సాగుచేస్తున్న ఆయిల్‌పామ్, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటలను పరిశీలించారు. రైతులకు సాగులో జాగ్రత్తలు, ఎరువుల యాజమాన్యం వివరించారు. ఎర్రుపాలెం మండలం మీనవోలులో డ్రాగన్ ఫ్రూట్ తోటను చూసి రైతు పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో మాట్లాడారు. బొప్పాయి తోటలను పరిశీలించారు. మధిర ఉద్యాన అధికారి ఎ.విష్ణు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

కారేపల్లి, న్యూస్‌టుడే: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్ అన్నారు. కారేపల్లిలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తుగా ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీలలో అన్ని పార్టీల నాయకులకు అవకాశం కల్పించాలన్నారు. డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, మండల కార్యదర్శి సందీప్, నాయకులు తేజా నాయక్, రాకేశ్, సత్తిరెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: మధిర పట్టణంలోని వినాయకుడి గుడి దగ్గర మురుగు నీరు నిల్చి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. **చలువాది నర్సింహారావు**

సమాధానం: సిబ్బందితో మరమ్మతులు చేయిస్తాం. **రేవతి, హెల్త్ ఇన్‌స్పెక్టర్**

– మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

బోనకల్లులో జగ్గయ్యపేట రహదారి పక్కన వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు, మాంసం దుకాణాల వారు వ్యర్థాలను పడేస్తున్నారు. **- గ్రామస్థుడు**

✔ చెత్త వేస్తున్న విషయం వాస్తవమే. ఇప్పటికే ఒకసారి తొలగించాం. పునరావృతం కాకుండా చూస్తాం.

- రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి

– బోనకల్లు, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

స్థానిక హనుమాన్ నగర్‌లోని వాటర్ ట్యాంక్ సమీపంలో డ్రైనేజీలు పూడిపోవడంపై 'మేమున్నా.. మీకు తోడుగా'లో కథనం ప్రచురితమైంది. మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ స్పందించి సిబ్బంది సాయంతో పూడిక తీయించారు.

– సత్తుపల్లి, న్యూస్‌టుడే

ముగిసిన జాతర.. హుండీల లెక్కింపు



నగదును లెక్కిస్తున్న సిబ్బంది

కారేపల్లి, న్యూస్‌టుడే: దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన ఉసిరికాయలపల్లి శ్రీకోటమైసమ్మ తల్లి జాతర ముగిసింది. మొదటి విడతలో దేవాలయంలోని హుండీలను గురువారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ.7,03,006 వచ్చింది. గతేడాది కంటే రూ.7000 అధికంగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. రెండో విడత హుండీల లెక్కింపు ఈనెల 21న చేపట్టనున్నారు. దేవాదాయ శాఖ ఖమ్మం పర్యవేక్షకులు అనిల్‌కుమార్, దేవాలయం ఛైర్మన్ పట్టాభి రామారావు, ఈవో వేణుగోపాలచార్యులు, దేవాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరా డెయిరీ పరిశీలన

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: ఎర్రుపాలెంలోని ఇందిరా డెయిరీ పాల శీతలీకరణ కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ గురువారం పరిశీలించారు. తక్కెళ్లపాడులోని పాల సేకరణ కేంద్రాన్ని సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. పాల సేకరణ, శీతలీకరణ కేంద్రం నిర్వహణను ఏపీఎం వెంకటేశ్వర్లు అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఎంపీడీఓ సురేందర్ పాల్గొన్నారు.



ఎర్రుపాలెంలో డెయిరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

నిఘా నేత్రాలు.. నిద్రపోతున్నాయ్!



ముదిగొండ, తల్లాడ, న్యూస్‌టుడే

'ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమ'ని పోలీసు అధికారులు చెబుతుంటారు. నిఘా నేత్రాలున్నచోట చోరీకి నేరస్థులు వెనకడుగు వేస్తుంటారు. వీటి ప్రాధాన్యం గుర్తించిన ప్రజలు, వ్యాపారులు ఉమ్మడిగా ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు నిద్రపోతున్నాయి. సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లోని మండల కేంద్రాల్లో నిర్వహణ కరవై చాలాచోట్ల నిరుపయోగంగా మారాయి. అవసరాలకు, ఏర్పాటైన వాటి సంఖ్యకూ హస్తిమశకాంతరం ఉండటం మరో సమస్య.

మధిర, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లో మూడు మున్సిపాలిటీలు, జూలూరుపాడు మినహా 11 మండల కేంద్రాలున్నాయి. దాతలు, ప్రజలు, వ్యాపారుల సహకారంతో పోలీసులు మొత్తం 94 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. కొందరు దుకాణాల్లో సైతం సమకూర్చుకున్నారు. కూడళ్ల వద్ద అమర్చిన సీసీ కెమెరాలను పోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేశారు. ఇంతవరకూ బాగానే ఉన్నా వాటి నిర్వహణ విస్మరించటంతో చాలాచోట్ల అలంకారప్రాయమయ్యాయి. కొన్నిచోట్ల పనిచేస్తున్నాయో? లేదో? తెలియటం లేదు. పోలీసులకు సైతం ఏదైనా ఘటన జరిగిన సమయంలో వాటి ప్రాధాన్యం గుర్తొస్తోంది. కీలక సమయంలో ఆధారాలు, సాక్ష్యాలు లభించక నిందితులను సకాలంలో గుర్తించలేకపోతున్నారు.



సీసీ కెమెరాలు లేని తల్లాడ బస్టాండ్

అవసరాలకు, ఏర్పాటుకు పొంతనేది?

మండల కేంద్రాలన్నీ శరవేగంగా విస్తరిస్తున్నాయి. ప్రధాన రోడ్డుకిరువైపులా వాణిజ్య సముదాయాలు పెరిగిపోతున్నాయి. ఉప వీధుల్లో సైతం జనసమర్థం అధికమవుతోంది. స్థానిక అవసరాలకు సరిపడా సీసీ కెమెరాలను ఏర్పాటు కాలేదు. కొన్నిచోట్ల వ్యాపారులు దుకాణాల్లో అమర్చుకున్న వాటిని బయట వైపు తిప్పి రహదారికి అనుసంధానిస్తున్నారు. ★ చింతకానిలో బహిరంగ ప్రదేశాల్లో ఒక్క సీసీ కెమెరా లేదు. ఘటన జరిగినప్పుడు స్థానిక పెట్రోల్ బంకుల్లోని ఫుటేజీల సాయంతో నిందితుల ఆచూకీ గుర్తించేందుకు ప్రయత్నిస్తారు. ★ తల్లాడలో పది అమర్చారు. అన్నీ ఒకే వైపు ఉండటంతో రెండోవైపు ఘటన జరిగితే పసిగట్టే అవకాశం ఉండటం లేదు. రెండు వరుసల రోడ్డు కావటంతో ఎక్కువ దూరంలో దృశ్యాలను కెమెరాలు గ్రహించటం లేదు. ★ ఏన్కూరులో కేవలం మూడే ఉన్నాయి. పొడవైన ప్రధాన రహదారిలో ఏమాత్రం ఇవి అవసరాలను తీర్చటం లేదు. ★ ఎర్రుపాలెంలో రైల్వేస్టేషన్ వైపు సీసీ కెమెరాలు లేవు.

చోరీ ఘటనలు..

➡ తల్లాడ మండల కేంద్రం నడిబొడ్డున ఉండే బస్టాండ్‌లో సీసీ కెమెరాలు లేవు. ఇటీవల మల్లారం గ్రామానికి చెందిన అధ్యాపకుడు తూటారి పుల్లారావు, అదే గ్రామానికి చెందిన కండక్టర్ రమేశ్, వెంకటగిరికి చెందిన 108 ఉద్యోగి రామారావులకు చెందిన ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ➡ కొణిజర్లలో ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. నగదు, బంగారు ఆభరణాలు దుండగులు ఎత్తుకెళ్లారు. ➡ కల్లూరు సమీపంలోని రామాలయంలో రూ.2లక్షల విలువైన ఉత్సవ విగ్రహాలు చోరీకి గురయ్యాయి. ➡ పెనుబల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని ఓ ఇంట్లో రూ.3లక్షల బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి.



ముదిగొండలో నిరుపయోగంగా సీసీ కెమెరాలు

'నేర పరిశోధనలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయి. నిర్వహణ ముఖ్యమని ఇప్పటికే అనేకసార్లు సూచించాం. అన్నిచోట్ల సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటాం.' **- రెహమాన్, వైరా ఏసీపీ**

ఎందుకు పనిచేయటం లేదు?

1. అమర్చి వదిలేస్తున్నారు. ఆ తర్వాత నిరంతర పర్యవేక్షణ ఉండటం లేదు.
2. తీగలు తెగిపోవటం, సాంకేతిక సమస్యలతో మూలనపడుతున్నాయి. కొన్నిచోట్ల కోతులు తీగలు తెంపేస్తున్నాయి.
3. పనిచేయని వాటిని బాగుచేయించడం పోలీస్ శాఖకు భారంగా మారటంతో పునరుద్ధరణపై దృష్టి సారించటం లేదు.
4. ప్రమాదం, నేర సమయంలో వీటి గురించి ఆలోచిస్తున్నారు తప్ప మిగిలిన వేళల్లో విస్మరిస్తున్నారు.

పరిష్కారం ఏంటి?

1. సీసీ కెమెరాల పనితీరును నిత్యం పోలీసులు పర్యవేక్షిస్తుండాలి.
2. మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. పంచాయతీలు ఈ విషయంలో చొరవ తీసుకోవాలి. చాలా సందర్భాల్లో పోలీస్ అధికారులే మరమ్మతులు చేయిస్తున్నారు.

నియోజకవర్గం	మండల కేంద్రాలు	మొత్తం జనాభా	ఏర్పాటు	పనిచేస్తున్నవి
మధిర	ముదిగొండ, చింతకాని, ఎర్రుపాలెం, బోనకల్లు	19,300	16	4
సత్తుపల్లి	తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, కల్లూరు	31,000	64	41
వైరా	కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి	19,000	14	3

ఇందిరా మహిళా శక్తి యూనిట్ ప్రారంభం



యూనిట్ ప్రారంభిస్తున్న ఏపీడీ ఎండీ నూరుద్దీన్, ఇన్‌ఛార్జి డీఎల్పీఓ చంద్రశేఖర్ తదితరులు

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు పట్టణ పరిధిలోని ఇందిరా మహిళా శక్తి యూనిట్‌ను డీఆర్డీఏ ఏపీడీ ఎండీ నూరుద్దీన్, కల్లూరు ఇన్‌ఛార్జి డీఎల్పీవో చంద్రశేఖర్ గురువారం ఏర్పాటు చేశారు. రూ.4 లక్షల బ్యాంకు రుణాలతో ఏర్పాటు చేసిన ప్రసన్నలక్ష్మి యూనిట్ హోటల్, కర్రీ పాయింట్‌ను ప్రారంభించారు. గతంలో బ్యాంకు రుణాలతో ఏర్పాటు చేసిన ఫస్ట్‌లుక్ జహ్నబీ రెడీమేడ్ దుకాణం, కర్రి పాయింటును పరిశీలించారు. ఏపీఎం వెంకటరామారావు, గ్రామ సమాఖ్యల అధ్యక్షురాలు ఎండీ షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

డీఈగా బాధ్యతల స్వీకరణ

వైరా, న్యూస్‌టుడే: వైరా విద్యుత్తుశాఖ డీఈగా బండి శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ నుంచి బదిలీపై శ్రీనివాసరావు వైరాకు వచ్చారు. ఇప్పటి వరకు హీరాలాల్ ఇన్‌ఛార్జి డీఈగా పని చేశారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: తొండలగోపరం పంచాయతీ పరిధిలోని తొర్లపాడు పాఠశాలలో తొమ్మిదేళ్లుగా ఉపాధ్యాయులుగా పని చేస్తూ బదిలీపై వెళ్తున్న రాయబారపు రమేష్, చందనను గ్రామస్థులు గురువారం సన్మానించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి: సీఐటీయూ

మధిర, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ టీచర్లకు అయిదు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందికి గురువారం వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా నాయకుడు శీలం నర్సింహారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మధిర, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫార్సుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిశోర్ గురువారం అందజేశారు. మధిర, ఆత్కూరు, దెందుకూరు, ఖమ్మంపాడు గ్రామాల లబ్ధిదారులకు మొత్తం రూ.2.5 లక్షల చెక్కులందించారు.

విలీన సభను జయప్రదం చేయండి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: టీయూసీఐలో ఇఫ్టూ విలీనం సందర్భంగా హైదరాబాద్‌లో ఈ నెల 20న నిర్వహించే సభను విజయవంతం చేయాలని పీఎస్‌సీడబ్ల్యూయూ రాష్ట్ర కోశాధికారి సీవై పుల్లయ్య, రాష్ట్ర నాయకుడు శరత్‌లు పిలుపునిచ్చారు. స్థానిక జేవీఆర్ ఓసీలో గురువారం సంబంధిత గోడపత్రాలను ఆవిష్కరించారు.

అయ్యప్ప భక్తుల ఇరుముడులు

తల్లాడ, న్యూస్‌టుడే: బాలపేట, అన్నారుగూడెం గ్రామాల్లో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అన్నారుగూడెంలో ఇరుముడికి మట్టా దయానంద్ హాజరయ్యారు.

నియామకం

కారేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా కారేపల్లికి చెందిన బి.చందూనాయక్ నియమితులయ్యారు. సంబంధించిన పత్రాన్ని సంఘం ఛైర్మన్ చీమ శ్రీనివాస్ నుంచి గురువారం అందుకున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

వేంసూరు, న్యూస్‌టుడే: బీరాపల్లి విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు.

కుమురం భీం వర్ధంతి

కొణిజర్ల, న్యూస్‌టుడే: తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో కుమురం భీం వర్ధంతి గురువారం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రధానాచార్యులు బి.రాజశ్వరీ, ఉప ప్రధానాచార్యులు డాక్టర్ స్వర్ణకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

మధిర, న్యూస్‌టుడే: మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్న హనుమాన్ కాలనీకి చెందిన తాడూరి కొండకు ఖమ్మం సహకార బ్యాంకు మేనేజర్ మధుళిక ఆధ్వర్యంలో హెల్పింగ్ హ్యాండ్స్ సమాజ సేవా సంస్థ రూ.10వేలను అందించారు. కొండ కుమారుడు అరుణ్‌కు సంఘ బాధ్యులు బత్తుల రవిచంద్ర, మాధవరపు నాగేశ్వరరావు ఈ మొత్తం ఇచ్చారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మహాసభలో మాట్లాడుతున్న టీఎస్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

కొణిజర్ల, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం సంఘం 11వ మహాసభ నిర్వహించారు. ఎంఈవో డి.అబ్రహం, సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కే రంజాన్, ఉపాధ్యక్షులు ఎ.సుధాకర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు వై.కోటేశ్వరరావు, ఎం.ప్రసాదరావు పాల్గొన్నారు.

సాయిబాబుకు నివాళి

ఏన్కూరు, న్యూస్‌టుడే: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వంకిన సాయిబాబుకు పలువురు నివాళి అర్పించారు. కమ్మవారి కల్యాణ మండపంలో గురువారం సంతాప సభలో విశ్రాంత ఉద్యోగుల జిల్లా నాయకులు రఘుపతి రెడ్డి, నర్సయ్య, రాఘవరావు, రామచంద్రయ్య, నాగేశ్వరరావు, జగన్మోహన్‌రావు, రామారావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇదీ క్రీడా ప్రాంగణమే..

ఈ చిత్రం చూశారా. తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డు కనిపిస్తున్నా ఇక్కడ ఆట స్థలం కనిపించకుండా దట్టంగా పిచ్చిమొక్కలు కమ్ముకున్నాయి. క్రీడలను ప్రోత్సహించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ప్రాంగణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. అందుబాటులో ఉంచిన స్తంభాలు కూడా కనిపించడం లేదు. భగవాన్‌నాయక్ తండాలో చెప్పుకోవడానికే అన్నట్లుగా ఉన్న ఈ ప్రాంగణాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.



– ఏన్కూరు, న్యూస్‌టుడే

వృథాగా ప్రభుత్వ భవనాలు

మండలంలో రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ భవనాలు వృథాగా పడి ఉన్నాయి. వీఎం బంజర్‌లోని ర.భ. శాఖ డివిజన్ కార్యాలయంలో డీఈ, ఏఈ అధికారుల నివాస గృహాలు శిథిలావస్థకు చేరాయి. గిరిజన సహకార సంస్థ రూ.10 లక్షలతో 13 ఏళ్ల క్రితం నిర్మించిన గోదాము నిరుపయోగంగా మారింది. పిచ్చిమొక్కలు పెరిగాయి. మండల కార్యాలయ ఆవరణలో పదేళ్ల క్రితం నిర్మించిన హౌసింగ్ కార్యాలయం ఆ శాఖ రద్దుతో నిరుపయోగంగా తయారైంది. జడ్పీటీసీ భవనం కూడా అయిదేళ్లుగా వృథాగా పడి ఉంటోంది. – పెనుబల్లి, న్యూస్‌టుడే



వీఎం బంజర్‌లో గిరిజన సహకార సంస్థ రూ.10 లక్షలతో నిర్మించిన గోదాము



సత్తుపల్లి: వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్, ఇతర అధికారులు



కల్లూరు: కార్యక్రమంలో ఆర్డీఓ రాజేందర్‌గౌడ్ తదితరులు

వాల్మీకి జయంతి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించారు. కమాండెంట్ పీజేపీసీ ఛటర్జీ వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.డి.రంగారెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

కల్లూరు, న్యూస్‌టుడే: ఆర్డీఓ రాజేందర్ గౌడ్, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్ తదితరులు వారివారి కార్యాలయాల్లో గురువారం వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పించారు.

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: వాల్మీకి యువసేన ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని ఆత్కూరు గ్రామంలో నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకులు మీనుగు చైతన్య, అప్పారావు, మీనుగు శంకర్, పుల్లయ్య, స్వామి, వెంకటయ్య, నాగయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మధిర, న్యూస్‌టుడే: మధిర మున్సిపాలిటీలోని మడుపల్లి శాఖ గ్రంథాలయంలో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. గ్రంథాలయం ఇన్‌ఛార్జి బి.నాగలక్ష్మి వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పించారు.

'మతం పేరుతో రాజకీయాలు'

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: దేశంలో మోదీ ప్రభుత్వం మతం పేరుతో రాజకీయాలు చేస్తుందని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు విమర్శించారు. ఎర్రుపాలెంలో గురువారం పార్టీ మండల మహాసభలో మాట్లాడారు. అయోధ్యలో భాజపాను ప్రజలు ఓడించారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ మత రాజకీయాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, భాజపా సొంతంగా అధికారంలోకి రాలేకపోయిందన్నారు. మండల నూతన కార్యదర్శిగా మద్దాల ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు బండి రమేశ్, చింతలచెర్వు కోటేశ్వరరావు, వీరయ్య, జోగయ్య, హనుమంతరావు, సంజీవరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

చింతకాని, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నామవరం గ్రామానికి చెందిన రెడ్డిబోయిన రాంబాబు(31) చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. రాంబాబుకు పదేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఓ కుమారుడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవటంతో మూడేళ్ల క్రితం పెద్ద మనుషుల సమక్షంలో విడిపోయారు. ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసైన రాంబాబు ఈ నెల 16న పురుగు మందు తాగాడు. ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

కల్లూరు, న్యూస్‌టుడే: పేరువంచ గ్రామంలో బుధవారం కారు ఢీకొని ఎనిమిది మందికి గాయాలైన విషయం విదితమే. వారిలో మంచాల చిన్ననరసయ్య (60) ఖమ్మంలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కల్లూరు ఎస్ఐ షాకీర్ తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

వేంసూరు: పాత వివాదాల నేపథ్యంలో పల్లెవాడలో పరిగడుపు వీరాస్వామి అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి సుందరం, సుధాకర్, ఆనంద్, వెంకట్‌లు కర్రలతో దాడి చేశారు. బాధితుని భార్య బేబి ఫిర్యాదు మేరకు బాధ్యులపై కేసు నమోదు చేశారు.

చోరీ యత్నంపై..

మధిర పట్టణం, న్యూస్‌టుడే: మధిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని అటవీ శాఖ కార్యాలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి చోరీకి యత్నించినట్లు పట్టణ ఎస్సై సంధ్య తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాణోతు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

పిడుగుపాటుకు సామగ్రి దగ్ధం

వేంసూరు, న్యూస్‌టుడే: మర్లపాడులో గురువారం సాయంత్రం కనమాల నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇంటి సమీపంలో పిడుగుపడటంతో ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, కూలర్ లాంటి విద్యుత్తు ఉపకరణాలు కాలిపోయాయి. బాధిత కుటుంబం రెవెన్యూ అధికారులకు సమాచారం అందించింది.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

బోనకల్లు, న్యూస్‌టుడే: నారాయణపురం గ్రామ పరిధిలో మేత కోసం పొలం వెళ్లిన ఓ పాడిగేదె రక్షణ లేని విద్యుత్ నియంత్రికను తాకి విద్యుదాఘాతంతో గురువారం మృతి చెందింది. చనిపోయిన గేదె విలువ రూ.లక్ష ఉంటుందని రైతు తెలిపారు.

పేదరికాన్ని అధిగమించి..

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో పలువురు పేద కుటుంబాల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ వృత్తి లక్ష్యంగా వారు ఈ కొలువులు సాధించగలిగారు. మూడు రోజుల క్రితం తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో చేరారు.



మండల పరిధిలోని ఆత్కూరు గ్రామానికి చెందిన సాహెదాబేగం ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించారు. భర్త కారు డ్రైవర్. ఆమె ఇంటి వద్దే ఉంటూ పరీక్షలకు సిద్ధమయ్యారు.



దెందుకూరు గ్రామానికి చెందిన మోదుగు జ్యోతి తండ్రి లేరు. తల్లి కమలమ్మ కూలి పనులు చేసుకుంటూ చదివించింది. బీఈడీ పూర్తిచేసి ఆమె అదే గ్రామానికి చెందిన వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. భర్త నాయీబ్రాహ్మణ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఎటువంటి శిక్షణ లేకుండా ఇంటి వద్ద ఉంటూ స్కూల్ అసిస్టెంట్ బయాలజీ ఉద్యోగం సాధించారు.

కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్ష

వేంసూరు, న్యూస్‌టుడే: ఈ ఏడాది సన్న రకాలు బాగా పండించారని, మండలంలో 6 కొత్త కేంద్రాలు ఏర్పాటైనట్లు మండల ప్రత్యేకాధికారి హుస్సేన్‌నాయక్ తెలిపారు. వేంసూరు రైతువేదిక భవనంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. మొత్తం 29 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వ్యవసాయాధికారి రామ్మోహన్ తెలిపారు. తహసీల్దారు రాజు, ఎంపీడీవో రమాదేవి, సీఈవోలు, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్లు పంపిణీ

ఏన్కూరు, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాలలో తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15 మంది బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఛైర్మన్ వల్లేపల్లి శశికాంత్, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో ఎస్.రమేశ్ విద్యార్థులకు అందించారు. సహకరించిన పూర్వ ఉపాధ్యాయురాలు బత్తుల రాజేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయురాలు వర్జీనియాలను అభినందించారు. మండల వైద్యాధికారి రాములు, పాఠశాల, టీఎస్ఆర్ఎస్ ప్రధానోపాధ్యాయులు కూరాకుల సైదయ్య, టి.శ్రీనివాసరెడ్డి, మన్మోహన్‌రెడ్డి, ఏఎస్సై సూర్యచంద్రరరావు, ఎస్బీఐ మేనేజర్ బి.జగన్ పాల్గొన్నారు.



సైకిళ్లు అందుకున్న బాలికలతో తానా ఫౌండేషన్ ఛైర్మన్ శశికాంత్, ఉపాధ్యాయులు

'పంచాయతీ తీర్మానాలను అమలుపరచాలి'

కల్లూరు, న్యూస్‌టుడే: ప్రతి కార్యదర్శి గ్రామాల్లో పంచాయతీ తీర్మానాలను అమలు పరిచే అధికారిగా వ్యవహరించాలని డీపీఓ ఆశాలత అన్నారు. కల్లూరు రైతు వేదికలో ఏర్పాటుచేసిన కల్లూరు డివిజన్ స్థాయి కార్యదర్శుల అవగాహన కార్యక్రమ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యదర్శులకు, ఎంపీఓలకు పలు సూచనలు చేశారు. కార్యదర్శులు నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించకుంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. కల్లూరు, ఖమ్మం డీఎల్పీవోలు చంద్రశేఖర్, రాంబాబులు, ఎంపీఓలు సురేష్‌బాబు, నారాయణ, ఉపేంద్ర, కృష్ణ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఓ ఆశాలత

బీటీ నిర్మాణానికి రూ.25 కోట్లు

బోనకల్లు, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రతిపాదనల మేరకు మండల పరిధిలో ఆరు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు ఈ వివరాలు తెలిపారు.

★ గార్లపాడు మీదుగా రామాపురం వెళ్లే వీఆర్ రోడ్డు నుంచి చింతకాని మండలం పాతర్లపాడు వరకు 3 కి.మీ. బీటీకి రూ.6.7 కోట్లు.
★ గోవిందాపురం(ఎల్) నుంచి పాతర్లపాడు వరకు 2.2 కి.మీ. తారు రోడ్డుకు రూ.4.6 కోట్లు.
★ గోవిందాపురం(ఎల్) నుంచి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ వరకు 1.1 కి.మీ. రోడ్డుకు రూ.2.6 కోట్లు
★ గోవిందాపురం(ఎల్) పాతర్లపాడు రోడ్డు నుంచి ఇంటిగ్రేటెడ్ స్కూల్ వరకు కి.మీ. రోడ్డుకు రూ.2.3 కోట్లు
★ గోవిందాపురం(ఎల్) నుంచి వైరా మండలం వల్లాపురం వరకు 3.5 కి.మీ తారురోడ్డుకు రూ.3.4 కోట్లు.
★ నాగులవంచ తిరుమలాపురం ర.భ. రోడ్డు నుంచి తుమ్మల చెరువు మీదుగా చింతకానికి 5 కి.మీ. బీటీకి రూ.5.4 కోట్లు.

సద్వినియోగం చేసుకోవాలి

కొణిజర్ల, న్యూస్‌టుడే: పత్తి రైతులు తమ దిగుబడులను సీసీఐ కేంద్రాల్లో విక్రయించుకుని మద్దతు ధర రూ.7,521 పొందాలని ఏఓ అధికారి డి.బాలాజీ సూచించారు. కొణిజర్ల, శ్రీనివాసనగర్‌లలో పత్తి పంటలను గురువారం పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న తొమ్మిది జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సీసీఐ కేంద్రాలకు వెళ్లే రైతులు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, ఆధార్ లింక్ అయిన చరవాణి నెంబర్ తీసుకెళ్లాలన్నారు.



శ్రీనివాసనగర్‌లో పత్తి చేలను పరిశీలిస్తున్న ఏవో బాలాజీ

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

'పారా లీగల్ వాలంటీర్లు చట్టాల గురించి తెలుసుకోవాలి'

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా న్యాయ సేవా సంస్థ తరఫున సేవలందిస్తున్న పారా లీగల్ వాలంటీర్లు చట్టాలపై అవగాహన ఏర్పరచుకోవాలని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి.చంద్రశేఖరరావు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సంస్థ సమావేశ మందిరంలో గురువారం జరిగిన పారా లీగల్ వాలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతి పౌరుడికి ఏదో ఓ సమస్య ఉంటుందని, వారికి ఎలాంటి సహాయం చేయడానికైనా పారాలీగల్ వాలంటీర్లు ముందుండాలని చెప్పారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా పని చేయడంతోపాటు వారి అవసరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కూడా వాలంటీర్లదేనని పేర్కొన్నారు. పారా లీగల్ వాలంటీర్లకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

21న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవం


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర పూర్వ నాయకుడు టి.వేణు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 50 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈనెల 21న ఖమ్మంలో పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర పూర్వ నాయకుడు టి.వేణు తెలిపారు. పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం లెనిన్‌నగర్‌లోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 50 వసంతాల ఉద్యమ గమనాన్ని సమీక్షిస్తూ రేపటి కర్తవ్యాలను నిర్దేశిస్తూ ఈనెల 21న ఖమ్మంలో, 24న హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభలు జరుగుతాయని వెల్లడించారు. ఖమ్మంలో 21న భారీ విద్యార్థి ప్రదర్శన, సాయంత్రం 5 గంటలకు రిక్కాబజార్ ఉన్నత పాఠశాలలో పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, నాయకులతో సదస్సు ఉంటుందని తెలిపారు. పూర్వ నాయకులు వెంకన్న, రమేశ్, సుభాన్, మోహన్‌రావు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.క్రాంతి, జి.మస్తాన్, నాయకులు సాగర్, రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా రక్షణకు పటిష్ఠ చట్టాలు అవసరం


ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మక్క, సంఘం బాధ్యులు

కూసుమంచి, న్యూస్‌టుడే: మహిళల రక్షణకు దేశంలో పటిష్ఠమైన చట్టాలతోపాటు వాటిని పకడ్బందీగా ఆచరించాల్సిన అవసరం ఉందని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మక్క అన్నారు. కూసుమంచి, పాలేరులో గురువారం నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. ఢిల్లీ, నిర్భయ లాంటి చట్టాలెన్ని తెచ్చినా బిల్కిస్‌బానో లాంటి హత్యాచారాలకు పాల్పడిన వారిని సన్మానించే సమాజంలో చట్టాల అమలు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభలను విజయవంతం చేయాలని కోరారు. మండల శాఖ అధ్యక్షురాలు రేవతి, కార్యదర్శి కళావతి, బాధ్యులు నీలమ్మ, మంగతాయి, విజయ, సక్కుబాయి పాల్గొన్నారు.

దారీతెన్నూ లేక.. ఇబ్బందులే అంతా!

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే


కుంచించుకుపోయిన దారి


ధ్వంసమైన కాలువలు

నగరంలోని పాత కార్పొరేషన్ కార్యాలయం నుంచి చర్చి కాంపౌండ్ వరకు నేరుగా వెళ్లే రహదారికి ట్రాఫిక్ తాకిడి గతంలో కన్నా మూడు రెట్లు పెరిగింది. గత ఏడాది శివాలయం వీధి కూడలి నుంచి ఖిల్లా ముఖ ద్వారం వరకు కొత్తగా రోడ్డును నిర్మించి రహదారిని కొంత వరకు అభివృద్ధి చేశారు. అక్కడి నుంచి పాత కార్పొరేషన్ కార్యాలయం వరకు కొనసాగిన రోడ్డును మాత్రం ముట్టుకోలేదు. దీంతో వాహనదారులు, స్థానికుల తిప్పలు రెట్టింపయ్యాయి. చెత్త ట్రాక్టర్ వచ్చినా ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించడం మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ రోడ్డుకు ముఖ్య ప్రవేశ ద్వారంగా ఉన్న కార్పొరేషన్ కూడలి వద్ద దారి మరింత కుంచించుకుపోయింది. ఇక్కడే గృహాలతో పాటు వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఇక్కడికి వచ్చే వాహనాలు ఆపే పరిస్థితి ఉండటం లేదు. కుంచించుకుపోయిన రహదారిలో తెలియకుండా వచ్చిన కార్లు, ఇతర వాహనాలు తిరిగి బయట పడేందుకు తిప్పలు తప్పడం లేదు. కొన్ని సందర్భాల్లో వాగ్వాదాలు, గొడవలు జరుగుతున్నాయి. కొన్నేళ్ల కిందట రహదారి విస్తరణ కోసం కార్పొరేషన్ అధికారులు స్థానికులతో సమావేశం ఏర్పాటు చేశారు. విస్తరణ అనివార్యమని చెప్పారు. అదిగో ఇదిగో అన్నారు. తర్వాత ఈ రహదారి వైపు కన్నెత్తి చూడటం లేదు. దారిలో రెండు వైపుల ప్రమాదకరంగా ఉన్నాయి. ఇందులోకి కొందరు ద్విచక్ర వాహనాలపై అతి వేగంగా దూసుకెళ్తున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా వెలుగు చూడటం లేదు. ఇరుకు దారిలో వాహనాలు ఎదురుపడ్డప్పుడు గంటల తరబడి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పక్క నుంచి వెళ్లేందుకు ప్రయత్నం చేసిన ప్రతిసారి అప్పటికే ధ్వంసమై ఉన్న కాలువల్లో టైర్లు చిక్కుకొని మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. పాత కార్పొరేషన్ కార్యాలయం కూడలి నుంచి చర్చి కాంపౌండ్ వరకు వెళ్లాలనుకునే వారు దగ్గరి దారిగా ఈ రహదారినే ఎంచుకొని వచ్చాక తిప్పలు పడుతున్నారు.

ఖిల్లాకు కీలకం

ఖిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది. రోప్‌వే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇలాంటి తరుణంలో పాత కార్పొరేషన్ కార్యాలయ కూడలి నుంచి ఖిల్లా ముఖ ద్వారం వరకు ఉన్న రహదారి విస్తరణ, నిర్మాణ పనులు జరగాల్సిన ఆవశ్యకత ఉంది. విస్తరణ అమలు చేస్తే సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇక్కడి స్థానికులు కొందరు చెప్పారు. కాలువలు మెరుగుపర్చి రోడ్డు విస్తరణ జరిగితే ఈ ప్రాంతంలో మరిన్ని వ్యాపార సముదాయాలు వెలిసే అవకాశం ఉంది. ఈ ఆలోచనతో స్థానికుల్లో చాలా వరకు విస్తరణకు గతంలోనే అంగీకారం తెలిపినట్టు స్థానిక వ్యాపారులు కొందరు చెప్పారు.

త్వరలో పనులు చేస్తాం

ఈ సమస్య నా 37వ డివిజన్‌లోనిది కాబట్టి తప్పక ప్రజలు కోరుకున్న విధంగా కాలువలు, రహదారిని అభివృద్ధి చేస్తాం. నిధులున్నాయి. ఇక్కడ కాలువల పరిస్థితి బాగాలేదు. రోడ్డు విస్తరణకు ముందు వాటిని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. కొన్నిచోట్ల రోడ్డు ఆక్రమణలు ఉన్నాయి. అన్నింటిని దృష్టిలో ఉంచుకొని స్థానికులకు ఇబ్బందులు లేకుండా వసతులు సమకూర్చే ఆలోచనతో ఉన్నాం. - ఫాతిమా జోహ్రా, ఉప మేయర్

స్థాయీ సంఘం సమావేశంలో వద్దిరాజు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పార్లమెంట్ ఆవరణలో గురువారం నిర్వహించిన పెట్రోలియం, సహజ వాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన సేవలందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

అన్నదాన పీఠం ప్రారంభం


అన్నదాన పీఠాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ రమణమూర్తి

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర రాంప్రసాద్, దాత పగడాల కిశోర్ ఆధ్వర్యంలో ఖమ్మం వీడీవోస్ కాలనీలో అయ్యప్ప మాలధారులకు ఏర్పాటు చేసిన అన్నదాన పీఠాన్ని గురువారం నగర ఏసీపీ రమణమూర్తి, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల, నరేందర్ దంపతులు ప్రారంభించారు. 41 రోజులు అయ్యప్ప దీక్షాపరులు పీఠంలో భిక్షను స్వీకరించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

చందాల పంపిణీ వివాదం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని 41వ డివిజన్‌లో దసరా చందాల వసూళ్లు వివాదాస్పదంగా మారాయి. పారిశుద్ధ్య కార్మికులు చందాలు వసూలు చేసుకొని పంచుకున్నారు. ఈ తరుణంలో ఆ డివిజన్ జవాన్‌కు కార్మికులకు మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో గురువారం ఓ కార్మికుడిపై జవాన్ దాడి చేయడంతో కార్మికుడు సహాయ కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

ఎల్ఆర్ఎస్ పరిశీలనకు రెవెన్యూ సిబ్బంది

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రాథమిక పరిశీలనకు రెవెన్యూ సిబ్బందిని వినియోగించుకోవాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య నిర్ణయించారు. పరిశీలనలో తీవ్ర జాప్యం జరుగుతున్నందున బిల్ కలెక్టర్లు, ఆర్ఐలను వినియోగించుకోవాలని గురువారం వారికి శిక్షణ ఇచ్చారు. వేలల్లో ఉన్న దరఖాస్తుల పరిశీలన ప్రణాళిక సిబ్బందికి, వారికి సహాయకులుగా పని చేస్తున్న సిబ్బందికి సాధ్యం కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

'ఆరు గ్యారంటీలు అమలు చేయాలి'

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ఎన్నికల హామీ ఆరు గ్యారంటీలను అమలు చేయాలని భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్(బీకేఎంయూ) జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా అధ్యక్షుడు పగిడిపల్లి ఏసు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు వీరభద్రం, రామలక్ష్మీ పాల్గొన్నారు.

ఇది మురుగు కాలువేనండోయ్?



మండలంలోని పెద్దతండా పంచాయతీలో నాయుడుపేటలోని ఖమ్మం-సూర్యాపేట ప్రధాన రహదారి వారగా ఉన్న మురుగునీటి కాల్వ ఇది. కాల్వలో నీళ్లు ఎటూ వెళ్లకుండా నిల్వ ఉండటం వల్ల పాకురు పట్టి పచ్చగా మారాయి. దోమలు వ్యాప్తి చెందడంతో పాటు దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఎంపీడీఓ కుమార్‌ని వివరణ కోరగా.. పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. – ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే

మైదానంలో మబ్బులే ప్రేక్షకులు



ఖమ్మం జోన్ క్రికెట్ పోటీలు గురువారం ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. ఆడే క్రీడాకారులు, నిర్వాహకులు మాత్రమే ఉన్నారు. మ్యాచులు జరుగుతున్న మైదానంపై మబ్బులే ప్రేక్షకులుగా కదిలాయి. నల్ల మబ్బులు వచ్చినప్పుడు వర్షం అంతరాయం ఉంటుందని ఆకాశం వైపు చూశారు. అవి కదిలి తెల్ల మబ్బులు రాగానే ఊరట చెందుతూ క్రికెటర్లు ఆట కొనసాగించారు. – ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

నిలిచిన సీటీ స్కాన్ సేవలు



ఖమ్మం సర్వజనాసుపత్రిలో సీటీ(కంప్యూటెడ్ టెమోగ్రఫీ) స్కాన్ సేవలకు బ్రేక్ పడింది. పరికరానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఫలితంగా రెండు రోజులుగా పరీక్షలు చేయడం లేదు. వచ్చిన రోగులు ప్రైవేటుకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు, పక్షవాతం బాధితులు, శరీరంలో గడ్డలు కట్టిన వారికి సీటీ స్కాన్ తప్పనిసరి. ప్రతిరోజు 30 మందికి పైగా రోగులకు స్కానింగ్ తీయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆస్పత్రిలో సేవలు నిలిచిపోవడంతో అత్యవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్షలు చేయిస్తున్నామని మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే ప్రక్రియ మొదలైందని.. త్వరలో సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. – ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే

కంచెలు తొలగిస్తే చర్యలు: కమిషనర్


చర్చిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య, సంపత్‌కుమార్, కృష్ణలాల్

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఎన్ఎస్ కెనాల్‌కు ఇరువైపులా ఉన్న పాదదారుల కంచెలు ఎవరైనా తొలగిస్తే చర్యలు తీసుకోవాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. ఎన్ఎస్ కెనాల్, ఖానాపురం మినీ ట్యాంక్‌బండ్, లకారం ట్యాంకుబండ్‌లను గురువారం సందర్శించారు. పాదదారుల్లో చెత్త వేయడంపై అసహనం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, ఈఈ కృష్ణలాల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన యుగంధర్

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడిని మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ గురువారం దిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో విమానాశ్రయాల అభివృద్ధి, ఇతర అంశాలపై మంత్రితో చర్చించారు. కొత్తగూడెంలో త్వరితగతిన విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

కాల్వలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

త్రిపురారం, న్యూస్‌టుడే: మతి స్థిమితం సరిగా లేక ముదిమాణిక్యం కాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెందారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని సాయిగణేష్ నగర్‌కు చెందిన కన్నెకంటి గోపికిశోర్(57)కు నాలుగేళ్లుగా మానసిక పరిస్థితి బాగాలేదు. 12న ఇంటి నుంచి బయటకు వెళ్లారు. నల్గొండ జిల్లా త్రిపురారం మండలం నీలాయిగూడెం పంచాయతీ పరిధిలోని ఘంటరావుక్యాంపు సమీపంలో ముదిమాణిక్యం కాల్వలో పడి మృతి చెందారు. కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: సాగర్ ప్రధాన కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఖానాపురం హవేలి పోలీసులు గురువారం వెలికి తీశారు. స్థానిక గోపాలపురం పవర్ ప్లాంట్ సమీపంలో సుమారు 30 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని వెలికితీసి ప్రభుత్వాసుపత్రి శవాగారానికి తరలించారు. మృతదేహం పూర్తిగా పాడైపోవడంతో నాలుగు రోజుల క్రితమే కాల్వలో పడినట్లు భావిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నం సేవాశ్రమం నిర్వాహకులు శ్రీనివాసరావు, సభ్యులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: చెన్నారం నుంచి అక్రమంగా తరలిస్తున్న 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లాకు చెందిన కొందరు అనుమతులు లేకుండా తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని ఠాణాకు తరలించారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డ ఘటన చెరువుమాదారం వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం. రాయిగూడేనికి చెందిన ప్రభాకర్ తన బైక్‌పై చెరువుమాదారం నుంచి వస్తున్నాడు. ఇదే క్రమంలో ఆచార్లగూడేనికి చెందిన రంజిత్ బైక్ ఎదురుగా వస్తున్నాడు. ప్రమాదవశాత్తు వీరి వాహనాలు బలంగా ఢీకొనటంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. నేలకొండపల్లి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

కార్మికురాలికి... ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికురాలు సంధ్య ట్రాక్టర్‌పై విధులు నిర్వహిస్తు గురువారం కిందపడి తీవ్ర గాయాలపాలైంది. రెండు నెలల క్రితం ఓ కార్మికుడు ట్రాక్టర్‌పై నుంచి పడి తీవ్ర గాయాలపాలై మరణించిన సంఘటన మరువకముందే మరో కార్మికురాలు గాయాలపాలవ్వడంతో కార్మికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: రాకాసితండా వరద బాధితులకు 'బడావో బంజారా ట్రస్ట్' ఆధ్వర్యంలో గురువారం ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేశారు. ఆనంద్ ప్రేమ్ సాగర్‌సింగ్, సోలోమెన్, మల్సూర్, రామాచారి, బాలరాజు, సందీప్, సుధాకర్, శంకర్ పాల్గొన్నారు.



బియ్యం అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: కోయచలకలో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు గురువారం సాయంత్రం పంపిణీ చేశారు. తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో గ్రామానికి చెందిన రేలా మల్లమ్మ, బొరిగొర్ల ఎల్లమ్మ, బొరిగర్ల కళావతి, మాదంశెట్టి కళావతిలకు ఒక్కొక్కరికి రూ.1,00,016 చెక్కులు మంజూరయ్యాయి. గ్రామంలో జరిగిన కార్యక్రమంలో రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, గ్రామ మాజీ సర్పంచి చెరుకూరి పూర్ణచంద్రరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. రెంటాల ప్రసాద్, మేళ్లచెరువు రాంప్రసాద్, మాదంశెట్టి హన్మంతరావు, సీతారాములు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు ప్రారంభం

కూసుమంచి, న్యూస్‌టుడే: కూసుమంచిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నెస్లే ఇండియా వ్యాపార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినుల అవసరాల నిమిత్తం ఐదు మరుగుదొడ్లను నిర్మించగా గురువారం ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరస్వామి, మాజీ సర్పంచి మోహన్, ఉపేందర్, సంస్థ మేనేజర్ వాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై అవగాహన

కామేపల్లి, న్యూస్‌టుడే: చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సైదులు అన్నారు. ఊటవాగు సమీపంలోని గొత్తికోయల గుంపులో చిన్నారులు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను గురువారం పంపిణీ చేశారు. పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌ను నియమించినట్లు సీడీపీవో దయామణి తెలిపారు. మండల వైద్యురాలు డా.చందన, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: గత నెల 8న ఖమ్మంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రైమరీ రీజినల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఖమ్మం హార్వెస్ట్ విద్యా సంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 3న నిర్వహించనున్న పరీక్షకు తమ విద్యార్థులు టి.శ్రీజిత్, ఎన్.రుష్యేంద్రమణి, కె.రుషిత్, సాయి అక్షిత్‌లు ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో పి.రవిమారుత్, ఆర్.పార్వతిరెడ్డి

బస్సు పునరుద్ధరణపై హర్షం



ఖమ్మం-డోర్నకల్ బస్సు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: ఖమ్మం-డోర్నకల్ బస్సును ఆర్టీసీ అధికారులు గురువారం పునరుద్ధరించారు. గత నెలలో భారీ వరదతో రఘునాథపాలెం మండలం కోయచలక-చిమ్మపూడి గ్రామాల మధ్య చప్టా వంతెన కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఈ మార్గంలో డోర్నకల్ బస్సు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పక్కనే తాత్కాలిక మార్గం ఏర్పాటు చేసినా బస్సు ప్రారంభం కాలేదు. దీనిపై మండల ప్రజల విజ్ఞప్తి మేరకు అధికారులు బస్సును గురువారం పునరుద్ధరించారు.

కర్నాటి కృష్ణయ్యకు నివాళి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం తొలి ఎమ్మెల్యే కర్నాటి కృష్ణయ్య వర్ధంతిని నేలకొండపల్లిలో గురువారం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జాతీయ కమిటీ సభ్యులు బాగం హేమంతరావు.. కృష్ణయ్య స్తూపానికి నివాళులర్పించారు.

ఖమ్మానికి పంచాయతీ ఎన్నికల సామగ్రి



ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి ఖమ్మానికి చేరుకుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాలకు పంపుతున్నారు. క్లోజ్డ్ కంటైనర్లలో ఖమ్మం చేరుకుంది. జిల్లా పరిషత్ భవనం ఆవరణలోని గోదాములో భద్రపరుస్తున్నారు. నిబంధనలు, మార్గదర్శకాలు తెలిపే పుస్తకాలు, సీళ్లు, లక్క, కవర్లు సహా అన్ని రకాల స్టేషనరీ ఇందులో ఉంది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సర్వం సిద్ధమవుతోంది.

అక్కడికి వెళ్లలేను... ఇక్కడ ఉండలేను

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లాలోని ఇద్దరు కమిషనర్ల బదిలీపై గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఒకరు మధిరకు వెళ్లలేను అంటుండగా, మరొకరు ఖమ్మం రాలేను అనడంతో ఉన్నతాధికారులకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు. మధిర కమిషనర్‌గా పని చేస్తున్న అహ్మద్ షమీ ఉల్లా గురువారం నగరపాలక సంస్థలో సహాయ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టేందుకు రాగా.. ఇక్కడి నుంచి మధిరకు బదిలీ అయిన సంపత్‌కుమార్ విధుల నుంచి విడుదల కాకపోవడంతో పరిస్థితి జఠిలంగా మారింది. మధిర కమిషనర్ పోస్టు లేకపోవడం, వేతనాలు సరిగా అందే అవకాశం లేకపోవడమే దీనికి కారణమన్న వాదన వినవస్తోంది. రాజకీయ ప్రమేయంతో ఈ బదిలీలు జరగడం, ఇద్దరు అధికారులు ఆయా స్థానాల్లో చేరేందుకు ఆసక్తి చూపకపోవడం సమస్యగా మారింది. ఈ తరుణంలో ఇద్దరు అధికారులు సెలవుపై వెళ్లేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. సంపత్‌కుమార్ శుక్రవారం నుంచి సెలవు పెట్టాలని నిర్ణయించుకోగా, షమీ ఉల్లా గురువారం నుంచే వెళుతున్నట్టు తెలుస్తోంది. అటు మధిర పురపాలకం, ఇటు ఖమ్మం నగరపాలక సంస్థల్లో పారిశుద్ధ్యం, ఇతర పనులపై ప్రభావం పడే అవకాశం ఉందని ఉద్యోగులంటున్నారు.

నేను కదిలేది లేదు...

ఇటీవలే నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఓ అధికారి డిప్యూటేషన్ రద్దు చేసి మాతృశాఖకు పంపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ నుంచి తాను కదిలేదని లేదని, తనను ఎవరూ పంపలేరంటూ తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. గురువారం అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ భర్తతో ఈ విషయమై చర్చించి, జిల్లాకు చెందిన ఓ మంత్రిని కలిసేందుకు తన ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తోంది. అయితే మంత్రి అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం ఆయనను కలిసి నగరపాలకంలోనే ఉండేలా తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్టు తెలుస్తోంది.

వాల్మీకి జయంతి

కూసుమంచి, న్యూస్‌టుడే: ఎంపీడీఓ కార్యాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో రామచంద్రారావు, ఏపీఓ అప్పారావు, ఏపీఎం సత్యవర్ధన్‌రాజు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చలో వరంగల్‌కు నాయకులు

ఖమ్మం రోటరీనగర్: ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ చేపట్టిన 'చలో వరంగల్' కార్యక్రమానికి ఖమ్మం విద్యుత్తు ఐకాస నాయకులు గురువారం తరలివెళ్లారు. జిల్లా నాయకులు గంటా శ్రీనివాస్, అన్వర్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఒప్పంద ఏఈఓలపై వేధింపులు మానుకోవాలి

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో అతి తక్కువ వేతనంతో పని చేస్తున్న ఒప్పంద వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈఓ)పై ప్రభుత్వం వేధింపులు మానుకోవాలని కోరుతూ ఖమ్మంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్యకు వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం జిల్లా కమిటీ నాయకత్వంలో వినతి పత్రం అందజేశారు. జిల్లా బాధ్యులు మహేశ్, కుమార్‌రాజా, సరిత, రాము, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.